# మాయ

♦ కొల్లూరి బి.బి.సాగర్ ♦



ఊర్నించొచ్చేసరికి పిడుగులాంటి వార్త.

సురేష్‌కి స్కూటర్ ఏక్సిడెంట్.

జగదాంబ సెంటర్లో కారుని వీడు గుద్దేడో, వీడ్ని కారే గుద్దిందో తెలీదు గానీ స్కూటర్ పచ్చడైపోయింది. వీడు ముక్కలైపోయాడు.

కేజీహెచ్‌లో పడేసేరని తెలిస్తే, పరిగెట్టు కెళ్ళేం నేనూ, మూర్తీ.

ఆర్థోపెడిక్ వార్డులో అడుగుపెట్టి "బెడ్ నెంబ రెంత చెప్పేర్రా శేషుగాడు" అన్నాను. బుర్ర గోకు తున్నాడు మూర్తి. అయిదు నిమిషాలు ఆలోచించి "పదమూడో, ముప్పై ఒకటో ఏదో చెప్పేర్రా" అన్నాడు. లాగి తన్నాలంత కోపమొచ్చింది నాకు. చిరచిరలాడుతున్న మొహాన్ని చూసి "పోన్లెద్దూ, అలా చూసుకుంటూపోతే ముందు పదమూడు, తర్వాత ముప్పైఒకటీ రాదేమిటి. వాడి మొహం మనమెరగవా" అని లోపలికి దారి తీసేడు. వేలాడుతున్న కాళ్ళూ, కాళ్ళకు వేలాడుతూ ఇసక బకెట్లూ, చేతి కట్లూ, తల కట్లూ, నానా బీభత్సంగా వుంది వార్డు.

మంచం మంచం చూసుకుంటూ వెదుతుంటే "అదుగోరా, సురేష్" మూర్తి అరిచేడు. అటు చూసేను. గుండె ఆగినంత పనయింది. ఒళ్ళంతా కట్లు కట్టేసేరు. కాళ్ళూ, చేతులూ, తలా ఏకమై దేన్నీ వదలకుండా అంతా కట్లతో కట్టేసారు. మూతీ, ముక్కూ ఏకమై గుర్తుపట్టలేనంతగా మారిపోయాడు సురేష్. ఏడుపొచ్చినంత పనయ్యింది నాకు. మూర్తయితే ఏకంగా ఏడ్చేస్తున్నాడు. మమ్మల్ని చూసి సురేష్ కొద్దిగా కదిలాడు. "ఆ... ఆ... కదలొద్దు" అన్నాన్నేను ఆదు ర్దాగా. సురేష్ ఏదో చెప్పాలనుకొని చెప్పలేకపోతున్నాడు. "నేను... నేను......" మాట నోరుదాటి రావడం లేదు. "నువ్వుండ్రా అంత ఇదిలో కూడా మాట్లాడే యాలా, మాట్లాడకుండా పడుకుని మేం చెప్పింది వింటూండంతే. ఆ నర్సుగానీ చూసిందంటే నీచేత మాట్లాడిస్తున్నామని మమ్మల్ని తరిమేస్తుంది మళ్ళీ" మూర్తి మందలిస్తున్నాడు.

కేరింతల్తో నవ్వుతూ, తుళ్ళుతూ వుండే సురేష్ ఈనాడిలా కదలకుండా నోరుమూసుకొని ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవలసి వచ్చింది. 'ఆహా ఇదేకదా విధి విలాసం అంటే' అనుకున్నాన్నేను. తెచ్చిన బత్తాయిలు తొక్కలు ఒలిచి తీసిన తొనలు, ముక్కలు కోసి ఏపిల్ ముక్కలు మూర్తి ఒక్కటొక్కటే సురేష్ నోటికి అంది స్తూవుంటే ఒద్దంటాడు వాడు. "నోర్మూయ్ వెధవా ఇలాంటప్పుడు ఇటువంటి ఆహారమే ఒంటికి బలం" అని కోప్పడి మూర్తి ఓ నాలుగు ఏపిల్ ముక్కలు తినిపించేడు వాడిచేత.

మళ్ళీ ఏదో చెప్పాలని కదుల్తున్నాడు సురేష్. "అసలు... నేను... నేను..." మధ్యలోనే అందు కున్నాడు మూర్తి "ఆ నీ నిర్వాకమంతా చెప్పేర్లే శేషు గాడు. అసల్నువ్వు స్కూటరెందుకు తొక్కాల్రా. వచ్చీ రాని డ్రైవింగూ నువ్వూను. పోనీ తొక్కేవు... ఏ రద్దీలేని రోడ్డుమీదా కాదు. జగదాంబ సెంటర్లో. అసల్నీకు బుద్ధి లేదురా. ఆ బండి చూడు తుక్కు తుక్కైపోయింది" నాన్ స్టాప్‌లాగ వాయించేస్తున్నాడు మూర్తి. "పోన్లే అయ్యిందేదో అయ్యింది. నీ సాధింపేటి మధ్యలో. వాణ్ణి ప్రశాంతంగా పడుకోనీ"కసురుకున్నాను మూర్తిని. వాడి అవస్థ చూస్తుంటే మనస్సంతా బాధతో నిండిపోయింది. వాడి చేతులు పట్టుకొని గాద్గదికంగా "ఏమిట్రా ఇది" అన్నాను. నా మాటని ఏడుపు మింగే స్తోంది. "మాతో అర కు టూరేనా వచ్చేవు కాదు. ఏదో పెళ్ళుందంటూ బతిమాల్నా రాలేదు. మాతోనే కనక వస్తే, నీకీ ఏక్సిడెంట్ లేకపోనా".

నెమ్మదిగా మూర్తి వాడిచేత ఓ నాలుగు బత్తా యిలూ, రెండు ఏపిల్సూ తినిపించేసేడు. అయిదో బత్తాయి ఒలుస్తుండగా ఓపిగ్గా లేచి కూర్చున్నాడు సురేష్. "ఆ... ఆ... ఎందుకూ లేవడం" అన్నాన్నేను. లేదు ఇంకాగలేను. మీతో ఓ విషయం చెప్పాలి అన్నాడు ఒగురుస్తూ. "ఏమిటి?" అన్నాడూ మూర్తి. "నేను స్కూటర్ మీంచి పడలేదు. నిచ్చెన మీంచి పడ్డాను" అన్నాడు. "ఆ..." అని నోరు తెరిచాం ఇద్దరం. "మరి అలా చెప్తాడేమిటి శేషుగాడు" అన్నాడు మూర్తి ఆశ్చ ర్యంగా. "శేషెవరండీ నా ప్రాణానికి" అన్నాడతను అసహనంగా. "శేషుగాడ్రా మన శేషుగాడూ. ఇలా మాట్లాడతాడేమిటి సురేష్" వాపోతున్నాడు మూర్తి. "సురేషెవరండీ" అరిచాడతను. తెల్లబోతూ చూసేడు మూర్తి. అయోమయంగా వుంది నాకు. "సురేషెవ రండీ నా పేరు సుబ్బారావయితే" అన్నాడతను ఆవే శంగా. మూర్తి నవ్వేస్తూ "పోరా వెధవ జోక్సూ నువ్వూను. హాస్పిటల్లో కూడా" అనేంతలో అతను లేచి బిగ్గరగా "బాబూ! నా పేరు సుబ్బారావు. ఊరు అనకాపల్లి. నిచ్చెనమీంచి పడి నడ్డి విరిగితే ఖర్మ కొద్దీ ఇక్కడకొచ్చేను. ఇప్పటికైనా నన్నునమ్మండి" అనేసరికి నేనెందుకైనా మంచిదని అతన్ని నఖశిఖ పర్యంతం పరిశీలించి అప్పుడు కెవ్వుమన్నాను. "ఇతను మన సురేష్ కాద్రా" అనేసరికి అతను నా గెడ్డాం పట్టుకొని "సార్ సార్ మీరైనా చెప్పండి నేను సుబ్బారావునని" అని బ్రతి మాల్డం మొదలెట్టేడు. మూర్తి కూడా అతను సురేష్ కాదని నిర్ధారించేసుకున్నాడు కామోసు— "అయితే ఆ సంగతి ఏపిల్ ముక్కలు మెక్కకముందు చెప్పాలి" అన్నాడు పెంకులెగిరిపోయేలాగ. "అయ్యో! ఎలాగండీ. చెప్తున్నవాణ్ణి చెప్పనివ్వకుండా, ఏపిల్సు నోట్లో కుక్కి తినూ, తినూ అంటే తినకేం చేస్తాను! అందులో ఏపిల్సు కూడా బహు తియ్యగా వున్నాయాయె!!" ఆ మాట విని మరింత రెచ్చిపోతున్న మూర్తిని ఎవరూ చూసి, నవ్వకముందే ఇవతలికి లాక్కొచ్చేసరికి నా తల ప్రాణం తోక్కొచ్చింది. బయటకొచ్చేక "వాడి దగ్గర రెండు బత్తాయిలు మిగిలాయి వెళ్ళి తెస్తా"నంటాడు. "చాల్చాల్లే పదా" అని బరబరా మూర్తిగాడ్ని ఈడ్చు కుంటూ మంచాలు వెదకడం మళ్ళీ మొదలెట్టాను. ♦